## క్లుప్తంగా

### ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కమలాపూర్ : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) కమలాపూర్ గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల ఇన్చార్జ్ శనిగరపు రవీందర్ తెలిపారు. అధ్యక్షుడిగా కొయ్యడ రమేశ్, ఉపాధ్యక్షులుగా మాట్ల శ్రీధర్, మాట్ల సాగర్, ప్రధాన కార్యదర్శిగా శనిగరపు నిశాంత్, కార్యదర్శిగా కొలుగూరి ప్రవీణ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా పుల్లా ప్రవీణ్, గౌరవ అధ్యక్షులుగా పుల్లా శ్రీనివాస్, మాట్ల రాజేందర్, మాట్ల మొగిలి, పుల్లా యుగేందర్, కొయ్యడ అశోక్, కార్యవర్గ సభ్యులుగా కొయ్యడ మహేష్, పుల్లా రమేశ్, ఒస్కుల రవీందర్, మాట్ల రాజు, కొయ్యడ శంకర్ ఎన్నికయ్యారు.

### నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నడికూడ : దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన పథకంలో భాగంగా మండల పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉచిత శిక్షణ ఉపాధి మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విమల మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు రేపు (గురువారం) ఉదయం 10 గంటలకు విద్యార్హత పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో ఎంపీడీఓ కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. 9849131050, 9642141539 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### రజక సంఘం బలోపేతానికి కృషి



దామెర : రజక సంఘం బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం నూతన అధ్యక్షుడు గొల్లపెల్లి వినోద్ అన్నారు. మండలంలోని ఊరుగొండలో రజక సంఘం నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి వినోద్, కార్యదర్శిగా చింతల రమేశ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ముప్పు రామస్వామి, శ్రీను, చంద్రమౌళి, వీరయ్య, రవి, కుమారస్వామి, క్రాంతి పాల్గొన్నారు.

### రాజేందర్‌కు డాక్టరేట్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు జెట్టి రాజేందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చే సింది. పొలిటికల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్, ఎస్టడీ విత్ రెఫరెన్స్ టు పంచాయతీరాజ్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి రాజేందర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సిహెచ్.దినేస్‌కుమార్ పర్యవేక్షణలో రాజేందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

### రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆశీర్వాదం

కాజీపేట: తెలంగాణ మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిలివేరు ఆశీర్వాదంను నియమిస్తూ మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు బొక్కల వెంకటస్వామి ఆదేశాలు జారీ చేశారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రా మానికి చెందిన ఆశీర్వాదం ఉద్యమ స్ఫూర్తిని గుర్తించి రాష్ట్ర కమిటీలో అవకాశం కల్పించారు. ఈ మేరకు కాజీపేటలో నియామక ఉత్తర్వులను ఆశీర్వాదం అందుకున్నారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తులకు 7వరకు గడువు

న్యూశాయంపేట : సీ శాట్–2025–26 ప్రవేశ పరీక్ష ఉచిత శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈనెల 7 వరకు గడువు ఉందని డైరెక్టర్ షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం (టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్) డాక్టర్ కే.జగన్‌మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ కనబర్చడానికి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ డిగ్రీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు హనుమకొండ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని కోరారు.

### నిషేధిత మందులు స్వాధీనం



తనిఖీల్లో పాల్గొన్న డ్రగ్ కంట్రోల్ టీం అధికారులు, సిబ్బంది

రామన్నపేట : నగరంలోని రంగశాయిపేటలోని ఆయుష్ ఫార్మసీలో నిషేధిత దగ్గు మందులు విక్రయిస్తున్నారని వచ్చిన పక్కా సమాచారంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం మంగళవారం తనిఖీ నిర్వహించారు. భారీగా నిషేధిత దగ్గు మందులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఆర్ఐ శివ కేశవులు, ఆర్ఎస్సై మనోజ్, పూర్ణ, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# మలుపులు.. ముళ్లపొదలు



శాయంపేట నుంచి కొత్తగట్టు సింగారం వెళ్లే రోడ్డును కమ్ముకున్న ముళ్లపొదలు



కొత్తగట్టుసింగారం వెళ్లేదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

- కొత్తగట్టుసింగారం వెళ్లాలంటే జంకుతున్న వాహనదారులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

శాయంపేట : మండల కేంద్రం నుంచి కొత్తగట్టుసింగారం వరకు నిర్మించిన రోడ్డు మలుపులతో వాహనదారులను ప్రమాదాల పడేస్తుంది. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే కేవలం మూడు కిలోమీటర్ల ప్రయాణంలో కొత్తగట్టు సింగారం చేరుకోవచ్చు. కానీ ఏపుగా పెరిగిన ముళ్లపొదలు రోడ్డును కమ్మేస్తుండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని పలువురు భయాందోలన చెందుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులకు ముళ్ల పొదలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్ల పొదలను, రోడ్డుపై వేసిన కొమ్మలను తొలగించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## వైద్య వృత్తి గౌరవప్రదమైంది

- మెడికల్ ఆఫీసర్ మంజుల

దామెర : సమాజంలో వైద్య వృత్తి అత్యంత గౌరవ ప్రదమైందని మెడికల్ ఆఫీసర్ మంజుల అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు డాక్టర్లు మహేంద్రకుమార్, ప్రమోద్‌రావు, రాధాశాంతిప్రియ, జాస్మిన్ మెహెరాను వైద్య సిబ్బంది శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం పలువురు వైద్యులు మాట్లాడుతూ.. వైద్యులు కనిపించే దైవాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న వ్యాధులను అరికట్టడంలో డాక్టర్లు చేస్తున్న కృషి వెలకట్టలేనిదన్నారు. కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించిన ఘనత డాక్టర్లదేనని కొనియాడారు. సిబ్బంది అశోక్ బాబు, శ్రీకాంత్, లీల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్లను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

### బాల్య వివాహాలపై 100కు డయల్ చేయండి

కాజీపేట: చదువుకునే వయస్సులో వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే వెంటనే 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. కాజీపేట మండలం సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాల్య వివాహాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ఆమె ప్రారంభించారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు యమడాల అనుకాంత్, హెచ్ఎం శోభ, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సులోచన, హుస్సేన్, హరీష్, చందు, అజీజ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

## రవీందర్ సేవలు స్ఫూర్తిదాయకం



రవీందర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వ్యాపారస్తులు

పరకాల : ఏడీఏగా వంగ రవీందర్ చేసిన సేవలను రైతులు, వ్యాపారస్తులు మరిచిపోలేరని రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏడీఏ రవీందర్‌కు ఉద్యోగ విరమణ సన్మాన మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా వ్యాపారస్తులు ఏడీఏ రవీందర్‌ను సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు అశోక్, రమేశ్, రవితేజ, మల్లికార్జున్‌తోపాటు అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

### కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కాజీపేట రూరల్ : మండలంలోని బిల్డింగ్ పెయింటింగ్ మేస్త్రీ వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్ లారెన్స్ అన్నారు. స్థానిక బాపూజీనగర్‌లో మంగళవారం యూనియన్ కార్మికులందరూ కలిసి 47వ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిరిల్ లారెన్స్‌ను గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు, కాజీపేటలో ఎమ్మెల్యే కార్మిక భవన్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు అన్నారు.

## క్రైం కార్నర్

### మహిళ ఆత్మహత్యాయత్నం

శాయంపేట : అత్తింటి పోరును భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని నేరేడుపల్లిలో చోటుచేసుకుంది. బాధితురాలు, ఆమె మేనమామ గొడుగుల సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన తన మేనకోడలైన కోమలను వర్ధన్నపేట మండలం రాయపర్తి గ్రామానికి చెందిన మచ్చ సైదులుతో గత నాలుగేళ్ల క్రితం వివాహం జరిపించినట్లు తెలిపారు. కోమల భర్త సైదులు అనారోగ్యంతో పదినెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి కోమల మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. వివాహ సమయంలో కోమల అత్తగారికి ఇచ్చిన వరకట్నం డబ్బుల విషయంలో గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా సైదులు ఆడ పడచులు, ఆడ పడుచుల భర్తలు రూ. 10లక్షలు కోమలకు జనవరి నెలలో ఇవ్వాలని తీర్మానించారు. గడువు దాటినా డబ్బులు ఇవ్వకపోవడంతో కోమల తన ఆడపడుచులకు ఫోన్ చేసి డబ్బులు అడిగింది. అయితే ఆమె ఆడబిడ్డలు, వాళ్ల భర్తలు 'నీ భర్త చనిపోయాడు, నువ్వు కూడా చనిపోయి ఉంటే ఆ డబ్బులు మాకే మిగులుతాయి' అంటూ దూషించినట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన కోమల జూన్ 30వ తేదిన పురుగులమందు తాగింది. గమనించిన చుట్టుపక్కల వారు అంబులెన్స్ పరకాలలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. కోమలను మానసికంగా వేధించిన ఆడ పడచులు శ్రీలత, శ్రీనివాస్, అనిల్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోమల మేనమామ సుదర్శన్ శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్థానిక పోలీస్‌లు తెలిపారు.

### ఇద్దరిపై కేసు

శాయంపేట : వ్యవసాయ భూమికి వెళ్లే దారిని చెరిపేసిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు అయ్యింది. మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వ్యవసాయ భూమికి వెళ్లే దారిని చెరిపేసినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన మలుసాని లక్ష్మణరావుకు గ్రామ శివారులోని సర్వే నంబర్ 85/1/ అలో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలోకి వెళ్లేందుకు సర్వే నంబర్ 334/1/ అ/ 2 లో పూర్వం నుచి దారి ఉంది. ఇదే క్రమంలో జూన్ 28న ఇదే గ్రామానికి చెందిన గొలుసుల దేవేందర్, జేసీబీ డ్రైవర్ మామిడిశెట్టి శివ జేసీబీతో ఆ దారిని చెరిపివేశారు. అడ్డుపడిన మాదారపు బాపురావును దూషించారు. లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవేందర్, శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతిచెందిన ఎద్దు

దామెర : విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పులుకుర్తిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెరుగు రవి తన ఎడ్లను వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లి పొలం పనులు చేశాడు. అనంతరం పచ్చిక కోసం వదలగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న వైర్ తగలడంతో విత్యుత్‌షాక్‌కు గురై ఒక ఎద్దు అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. దీంతో గమణించిన రైతు విద్యుత్ అధికారులకు సమాచారం అదించడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. సుమారు రూ.60 వేల విలువచేసే ఎద్దు చనిపోయిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు. సంఘటన స్థలాన్ని విద్యుత్ ఏఈ గుర్రం రమేశ్ పరిశీలించి రైతుకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### దర్గాలో చోరీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పీర్‌బాబా దర్గాలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు దర్గా పీఠాధిపతి హుస్సేన్‌ఖాద్రీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దర్గాలోకి ప్రవేశించి హుండీని అపహరించి అందులోని రూ.5వేలు తీసుకెళ్లి హుండీని సమీపంలోని చేనులో పడేసి వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హుస్సేన్‌ఖాద్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోష్ తెలిపారు.

### చికిత్స పొందుతూ ఒకరి మృతి

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సొరం మల్లయ్య మద్యం మత్తులో పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సొరం మల్లయ్య (45) పేయింటింగ్ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం 6 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి మద్యం సేవించాడు. మల్లయ్య మద్యం మత్తులో పురుగులమందు సేవించి రోడ్డుపై పడి ఉండగా గమనించిన స్థానికులు.. మల్లయ్య భార్య సొరం లతకు సమాచారం అందించారు. దీంతో మల్లయ్యను 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లయ్య మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హన్మకొండ కల్చరల్ : బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నా రు. మంగళవారం ఖిలా వరంగల్ కోటలో సీపీఐ నాయకులు ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్‌పాల్ అధ్యక్షతన సీపీఐ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడానికే ఆపరేషన్ కగార్‌ను అమలు చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం అవలంభిస్తున్న విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల రమేష్, జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు అవకాశమివ్వాలి

హన్మకొండ : జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి విడుదల చేసే నోటిఫికేషన్‌లో అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లకు అవకాశం కల్పించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఈఈయూ) నాయకులు కోరారు. మంగళవారం నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని టీఈఈయూ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ అధ్యక్షుడు జి.ఆంజనేయులు, కార్యదర్శి బి.వెంకటరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ప్రసాద్, నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్లు సి.ప్రభాకర్, వి.మోహన్‌రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఈఈయూ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఎల్.శ్రీనివాస్, ప్రశాంత్, జనగామ, భద్రాచలం జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, కె.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

- స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ సంపత్‌కుమార్

శాయంపేట : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛభారత్ కన్సల్టెంట్ సంపత్‌కుమార్ కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ–2025లో భాగంగా స్వచ్ఛతపై ర్యాంకింగ్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్‌ను మండలంలోని హుస్సేన్‌పల్లి, నర్సింహులపల్లి, ఆరెపల్లిలో సెంట్రల్ టీం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, గ్రామ పంచాయతీల పనితీరు, మరుగుదొడ్ల నిర్వహణ, స్పోకిట్, సామాజిక తనిఖీలు చేపట్టారు. గ్రామాల్లో మెరుగైన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న కారణంగా గ్రామాల్లో మురుగునీరు నిల్వకుండా చూడాలన్నారు. ప్రతీ రోజు పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎంపీడీఓ ఫణిచంద్ర, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఓ అనిత, సెంట్రల్ టీం సభ్యులు రాజు, రాణి, రేవంత్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



హుస్సేన్‌పల్లిలో పరిశీలిస్తున్న టీం సభ్యులు

## కుక్కలు, పందులతో జనం బెంబేలు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని కాలనీలో కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుక్కలు గుంపుగా ఉండడంతో దాడి చేస్తాయని ప్రజలు రోడ్డుపైకి వచ్చేందుకు జంకుతున్నారు. అదే ప్రాంతంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో కుక్కలు పందులపై దాడులు చేయడం, వాటి గుంపు ఆకస్మికంగా స్థానికులపై ఎగబడడంతో పలువురు గాయపడుతున్నారు. రాత్రి సమయంలో వాహనదారుల వెంబడి పరుగులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పలువురు తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలనీలో సంచరిస్తున్న పందులు

## జీఎంపీఎస్ మహాసభను జయప్రదం చేయాలి



దామెర : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆత్మకూరులో..

- జిల్లా ప్రధానకార్యదర్శి లింగయ్య

దామెర : గొర్రెల మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గొర్రెల కాపరులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాటి పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 4న కాజీపేట ప్యారడైజ్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ప్రముఖ కవి వరంగల్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సభకు గొర్రెల కాపరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు మిరియాల రవి, గౌరవ అధ్యక్షుడు వంగ రవి, సలహాదారుడు పెంట రవి, ఉపాధ్యక్షుడు సత్యం, శివ, రాజు, గొర్రెల మేకల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : జీఎంపీఎస్ (గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం) మూడో జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు మిర్యాల కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షుడు కాడబోయిన రమేశ్, మంతుర్తి రవి, కాడబోయిన రవి, లింగయ్య, జగన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల్లో పత్తిపాక సబ్‌సెంటర్



బిందెలో నీళ్లు తీసుకెళ్తున్న ఆశ వర్కర్



విద్యుత్ మెయిన్ తీగలకు వేసిన కొంకలు

- విద్యుత్ సదుపాయానికి లభించని మోక్షం
- వేధిస్తున్న తాగునీటి కొరత
- బిందెలతో మోసుకొస్తున్న ఆశాలు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో గల సబ్‌సెంటర్‌లో సమస్యలు వెక్కిరిస్తున్నాయి. దాదాపు సబ్‌సెంటర్ నిర్మించి పదహారేళ్లు గడుస్తున్నా విద్యుత్ సదుపాయం కల్పించపోవడం విద్దూరంగా ఉందని అక్కడికి వచ్చిన రోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. తాత్కాలికంగా విద్యుత్ తీగలకు కొంకలు వేసి రోజులు వెల్లదిస్తున్నారు. దాంతో పాటు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఆశ వర్కర్లు బిందెలతో ఇరత చోటు నుంచి మోసుకొస్తూ కాలం వెల్లదిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి విద్యుత్ సదుపాయంతోపాటు తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని స్థానికులు, సబ్‌సెంటర్‌కు వచ్చే రోగులు కోరుతున్నారు.

## 'భూ కబ్జాదారుడిపై వెంటనే చర్య తీసుకోవాలి'

ధర్మసాగర్ : దళిత వర్గానికి చెందిన బరిగెల సుధాకర్ భూమిని కబ్జా చేసి, కులంపేరుతో దూషించిన రొండ్ల సతీష్‌రెడ్డిపై అట్రాసిటి కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని ధర్మపురం గ్రామంలో మంగళవారం బరిగెల సుధాకర్‌కు చెందిన భూమి కబ్జాకు గురికాగా ఆ భూమిని దళిత, ప్రజాసంఘాల నాయకులు పరిశీలించా రు. అనంతరం వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 382లో ఆరు గుంటల భూమిని దళితుడైన బరిగెల కుమారస్వామి పట్టాదారైన గర్దాసు వెంకటమ్మ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పారు. భూమిపై కన్నేసిన సతీష్‌రెడ్డి ఆయన తల్లి పేరున అక్రమంగా, తప్పుడు పత్రాలతో పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. బాధితుడైన బరిగెల సుధాకర్ తన భూమిలో ఇల్లు నిర్మించుకునే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అక్కడకు వెళ్లిన సతీష్‌రెడ్డి బాధితుడిని కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించాడని ఆరోపించారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నామని అన్నారు. లేనిపక్షంలో దళిత, సామాజిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దెత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాదాసి సుదర్శన్, నాయకులు బరిగెల రాజు, సింగారపు యాదగిరి, మద్దెబోయిన వెంకటయ్య, అన్నందాసు దుర్గయ్య, ఓరుగంటి యాదగిరి, గర్దాస్ సునీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేందర్